76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21

శ్రీ వికారి నామ సంవత్సర 2019 ఏప్రిల్ 6
ఉగాది పండుగ సందర్భంగా రాజధాని వార్తలు
ప్రత్యేక సంచిక పుస్తకం ప్రచురణలో ప్రకటనలు
ఇచ్చేవారు ఈ క్రింది నంబరుకు సంప్రదించండి
రాజశేఖర్
98480 89624
7680 994755

# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 4 సంచిక 27, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 1 - ఆదివారం 7 ఏప్రిల్, 2019

వివరాలు 2లో...

దూసుకొస్తున్న దళిత తేజం

వివరాలు 3లో...

ప్రచార కూలీలు

వివరాలు 4లో...

నేతలపై అసంతృప్తి

వివరాలు 4లో...

మోడీ ..ఆమెను చూసి నేర్చుకోండి..

### మంగళగిరి బరి లోకేష్‌కు

# పూలబాటా.. ముళ్ళ బాటా!?

## హోరాహోరీగా ప్రత్యర్థుల ప్రచారం



**రాజధాని వార్తలు, అమరావతి :** రాజధాని ప్రాంతంలో కీలకమార్గంపై ఉన్న మంగళగిరి శాసనసభ నియోజకవర్గం ఇప్పుడు రాష్ట్రంలోనే కాక ఇతరప్రాంతాలలో కూడా ప్రాధాన్యం పొందుతున్నది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుమారుడు, ఐటీ, పంచాయితీరాజ్ మంత్రి నారా లోకేష్ ప్రత్యక్ష ఎన్నికల బరిలో ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ప్రాధాన్యతకు కారణమని చెప్పనక్కరలేదు. వెనుకబడిన తరగతులు (బీసీ) ముఖ్యంగా చేనేత వృత్తులవారు అధికసంఖ్యలో ఉన్న ఈ నియోజకవర్గం ఒకప్పుడు కమ్యూనిస్టులకు, పద్మశాలీలకు కీలకమైన నియోజకవర్గం.

ముఖ్యమంత్రి కుమారుడిగా లోకేష్ రాజకీయ ప్రవేశం, ఆతర్వాత శాసనమండలికి ఎన్నికై మంత్రివర్గంలో స్థానం పొందడం సహజంగానే వాదోపవాదాలకు దారితీసింది. చిన్నవయస్సులో శాసనమండలి ద్వారా మంత్రివర్గంలో స్థానం పొందడంపై విమర్శలు వచ్చాయి.

లోకేష్‌కు మంగళగిరి నియోజకవర్గం కేటాయించాడంపైన చర్చలు జరిగాయి. పార్టీ శ్రేణులలో కొందరు ఈ నియోజకవర్గం ఎంపిక సరైనది కాదని బహిరంగంగానే చెప్పారు. బీసీ లు ఎక్కువగా ఉండటమే కాక తెలుగుదేశం ఇక్కడ ఎప్పుడూ గెలువకపోవడం ఈ విమర్శలకు కారణం. లోకేష్ రంగంలోకి దిగకపోతే ప్రధాన ప్రతిపక్షం ఇక్కడ దీజ కి ప్రాతినిధ్యం ఇవ్వాలని నిర్ణయించింది. లోకేష్ పేరు ప్రకటించిన తర్వాతే వైకాపా ప్రస్తుత శాసనసభ్యుడు రామకృష్ణారెడ్డి కి అవకాశం ఇచ్చింది.

ప్రత్యక్ష ఎన్నికల బరిలో ప్రవేశిస్తున్న లోకేష్ కు క్లిష్టమైన నియోజకవర్గాన్ని ఎంపికచేయడం సరికాదని పార్టీ అభిమానుల భావన. లోకేష్ ను తెలుగుదేశం సునాయాసంగా గెలువగలిగిన ఏదో ఒక నియోజకవర్గం నుంచి నిలబెడితే తేలికగా విజయం సాధించేవారని పార్టీ నాయకుల అభిప్రాయం. అటువంటి నియోజకవర్గాలను సాక్షాత్తు అభ్యర్థులే లోకేష్ కు సూచించారనే విషయాన్ని వీరు ప్రస్తావిస్తున్నారు. లోకేష్ భీమిలీ నుంచి గాని, విశాఖలో ఏదో ఒక నియోజకవర్గం నుంచి గాని పోటీచేస్తారని వార్తలు వచ్చాయి. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నుంచి పోటీ చేస్తారని వార్తలు వచ్చాయి. ఇందుకు భిన్నంగా మంగళగిరి నియోజకవర్గాన్ని ఎంపిక చేయడం పార్టీ శ్రేణులలోనే కాదు, ఇతరులను ఆశ్చర్యపరిచింది. ముఖ్యమంత్రి విశ్వసనీయులు లోకేష్ అభిమానులకు ఈ నియోజకవర్గం ఎంపిక నచ్చలేదు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్న చేనేత వృత్తులవారు ఎక్కువగా ఉన్న మంగళగిరిలో పోటీ ఎంతమాత్రం సురక్షితం కాదని వీరి భావన. మొట్టమొదటిసారి ప్రత్యక్ష ఎన్నికలబరిలో దిగుతున్న వ్యక్తి అనుకూలమైన నియోజకవర్గాన్ని ఎంచుకోనాలని వీరి భావన.

ఈ అభిప్రాయంతో ఏకీభవించని వారు కూడా ఉన్నారు. సిట్టింగ్ అభ్యర్థి బరిలో ఉన్నంతమాత్రం చేత నియోజకవర్గం క్లిష్టమైనది

- మిగతా 2 లో

# తాయిలాలు, నోటుకు ఓటు

- కులసమీకరణలకు ప్రాధాన్యం
- ఓటరునాడి పట్టలేక నాయకుల ఆందోళన
- అన్ని సభలకు జనమే జనం




**రాజకీయ నాయకుల ప్రచార సభలకు భారీ సంఖ్యలో జనం హాజరవుతుండడంతో ఓటరు మనోగతం తెలుసుకోలేక ప్రధానపక్షాల నాయకులందరూ ఆందోళన చెందుతున్నారు. నాయకుల ప్రసంగాలలో ప్రత్యర్థి నేతలపై తీవ్ర విమర్శలు చేస్తున్న సందర్భంలో, తాము అధికారంలోకి వస్తే ప్రజలకు అందించబోయే తయిలాలు ప్రకటిస్తున్నప్పుడు ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేస్తున్నారు. అయితే ఇది ఒక నాయకుడికే పరిమితం కావడం లేదు. అందరికి చప్పట్లు కొడుతున్నారు. దీనితో ప్రజలు ఎవరివైపు ఉన్నారో నేతలు తెలుసుకోలేకపోతున్నారు.**

**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రజల మనోగతం తెలుసుకొనడం కోసం బయటివారి సర్వేలే కాక అభ్యర్థులు, పార్టీలు వేరుగా సర్వేలు చేసుకుంటున్నారు. కాని, సర్వే నివేదికలపైన అభ్యర్థులకు, పార్టీలకు నమ్మకం కుదరటం లేదు. పెద్ద పెద్ద సంస్థలు గతంలో చేసిన సర్వేలు విఫలం కావడమే ఇందుకు కారణం. అధికార తెలుగుదేశం గడిచిన 3 సంవత్సరాలుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సర్వే చేయించింది. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలలో 75% కి మించి సంతృప్తి వ్యక్తమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పలు సందర్భాలలో చెప్పారు. అదే నిజమని ఆయన నమ్మి ఉంటే ఎన్నికల సందర్భంగా భారీ స్థాయిలో తాయిలాలు ప్రకటించవలసిన అవసరమే లేదు. అంతే కాదు ప్రత్యేకహోదా పైనా, కేంద్రం రాష్ట్రానికి చేసిన అన్యాయంపై గడచిన 7,8 నెలలుగా భారీ స్థాయిలో నిర్వహించిన సభలకు విశేష స్పందన వచ్చిందని తెలుగుదేశం నాయకులు భావిస్తున్నారు. ఇది నిజమైన ప్రజల మద్దతు వారికి ఉన్నట్లే కదా ! కానీ ఆ నమ్మకం కుదరటం లేదు.

అందుకే ప్రధాన ప్రతిపక్షంగా భావిస్తున్న వైకాపా సంవత్సరం ముందే ప్రకటించిన నవరత్నాలలో ఇచ్చిన హామీలకు మించి ప్రజలకు తెలుగుదేశం తాయిలాలు ప్రకటించింది. తాయిలాలు ప్రకటించడమే కాదు కొన్ని పథకాల అమలుకు కూడా శ్రీకారం చుట్టింది. ఎన్నికల ముందే తమ హామీలు అమలు అవుతున్నాయనే విశ్వాసం ప్రజలలో కలిగించడమే లక్ష్యం. పెన్షన్ లు నిరుద్యోగబృతి రెట్టింపు చేసారు.

అంతటితో ఆగలేదు. పెన్షన్ నెలకు 3000 వేలు ఇస్తామని ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డి ప్రకటించగానే తామూ పెన్షన్ 3000 లకు పెంచుతామని చంద్రబాబునాయుడు ప్రకటించారు. కళ్యాణలక్ష్మి పథకం సహాయం కూడా రెట్టింపు చేస్తామని ప్రకటించారు. భారీ స్థాయిలో ఉద్యోగాలను కల్పించి "బాబు వస్తేనే జాబు వస్తుంది" అనే నినాదాన్ని నిజం చేస్తామంటున్నారు. ప్రజలంతా తమ వెంటనే ఉన్నారని చెప్పుకుంటున్న ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి కూడా హామీలు గుప్పించడంలో వెనక్కు పోవడంలేదు. ఎన్నికలకు ఎంతోముందు ప్రకటించిన నవరత్నాల ప్రకటన తర్వాత ఆయన ఇస్తున్న హామీలకు అంతే లేకుండా పోతోంది.

రాజకీయాలలో మార్పు కోసం రాజకీయాలలో అడుగుపెట్టినట్లు చెబుతున్న జనసేన అధిపతి పవన్ కళ్యాణ్ కూడా తాయిలాల విషయంలో వెనుకాడడం లేదు. రైతులకు నెలకు 5000 పెన్షన్ వంటి అనేక పథకాలు ఆయన ప్రకటిస్తున్నారు.

రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్న ప్రత్యేక హెూదా తామే అమలుచేయగలమని చెబుతూ రాష్ట్రంలో తమ అస్తిత్వాన్ని నిరూపించుకోవాలని అనుకుంటున్న కాంగ్రెస్ కూడా హామీలను గుప్పిస్తున్నది. ఈ వారంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించిన నెలకు 6000 రూ. కనీస ఆదాయ పథకం ఆ కోవలోనిదే. ఈ పథకం తమ అవకాశాలను మెరుగుపరుస్తుందని రాష్ట్ర నాయకుల ఆశ.

ఇన్ని తాయిలాలు ప్రకటిస్తున్న నాయకులు ఓట్లు దండుకోనడానికి కుల సమీకరణలు, మతాలపైన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. **రాష్ట్రంలో 34 శాసనసభ నియోజకవర్గాలలో ముస్లింల ఓట్లు నిర్ణయాత్మకం కాబోతున్నాయని భావిస్తూ ముస్లింలను ఆకర్షించడానికి ముమ్మరంగా ప్రయత్నాలు ప్రారంభించారు.** అలానే ఆయా నియోజకవర్గాలలో అధికశాతంలో ఉన్న కులాలపైన ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. కులం పేరుతొ కొన్ని ఓట్లు చీల్చగలిగితే ప్రత్యర్థి వర్గాన్ని దెబ్బతీయవచ్చునని ఆలోచన. అసలు ఈ ఎన్నికలో నిర్ణయాత్మక శక్తిగా చీలిక ఓట్లు అవతరించవచ్చునని విశ్లేషకుల అభిప్రాయం. ఇంతటితో అయిపోలేదు. ఎన్నికల సమయంలో తాము ఇచ్చే డబ్బే ఓటు రూపం దాలుస్తుందని నేతల విశ్వాసం. ఎన్నికల మేనిఫెస్టోలు అభివృద్ధి పథకాలపై నమ్మకం లేదు. అనుకూలపవనాలు సృష్టించుకొనే పరిస్థితులు కనబడడం లేదు. అధికార పక్షం ఓటుకు 3000 వేలు ఇస్తున్నట్లు ప్రతిపక్ష నేత చెప్తున్నారు. వైఎస్ అర్ సిపి, తెరాస అధినేత కే. చంద్రశేఖరరావు, ప్రధాని మోదీ భారీ ఎత్తున డబ్బు తరలిస్తున్నట్లు అధికార పక్షం ఆరోపిస్తోంది. మిగిలిన పార్టీల నాయకుల ఓటు రేటు తెలియకపోయినా వీరుకూడా ఓటుకు డబ్బు ఇవ్వక తప్పదు. ఈసారి ఎన్నికలలో అన్నిపార్టీలు కలిపి 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్లు విశ్లేషకుల అంచనా. జాతీయస్థాయిలో కూడా ఈ ఎన్నికలు అత్యంత ఖరీదైనవి కాబోతున్నాయని రాజకీయ విశ్లేషకుల అంచనా. కార్పొరేట్ సంస్కృతిపై మక్కువపెంచుకున్న రాజకీయ నాయకులు అదే స్థాయిలో రాజకీయాల "ఖరీదు" ను పెంచుతున్నారు.



## మోడీపై జవాన్ తేజ్ బహదూర్ పోటీ

**రాజధాని వార్తలు, వారణాసి :** తమకు నాణ్యతలేని ఆహారం పెడుతున్నారని బీఎస్ఎఫ్ జవాన్ తేజ్ బహదూర్ ఓ వీడియోలో గతంలో విడుదల చేశారు. ఇది కాస్తా వైరల్ గా మారడంతో ఆయన్ను బీఎస్ఎఫ్ విధుల నుంచి తప్పించింది. ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానంలో పెండింగ్ లో ఉంది. తాజాగా లోక్ సభ ఎన్నికల్లో ప్రధాని మోడీపై వారణాసి నుంచి పోటీకి దిగుతున్నట్లు తేజ్ బహదూర్ ప్రకటించారు. పలు రాజకీయ పార్టీలు తనను సంప్రదించాయనీ, అయితే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని తాను నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. వారణాసిలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తేజ బహదూర్ మాట్లాడారు.

భద్రతాబలగాల్లో జరుగుతున్న అవినీతిని బయటపెట్టేందుకు, మాట్లాడేందుకే తాను ఎన్నికల్లో పోటీచేస్తున్నట్లు తేజ్ బహదూర్ తెలిపారు.'ఎన్నికల్లో గెలవడం, ఓడిపోవడం అన్నది ముఖ్యం కాదు. భద్రతాబలగాలు ముఖ్యంగా పారామిలిటరీ దళాల విషయంలో కేంద్రం వైఫల్యాలను ఎత్తి చూపేందుకు ఈ పోటీకి దిగుతున్నా. జవాన్ల పేరు చెప్పి ఓట్లు సంపాదించేందుకు మోడీ చేసిందేమీ లేదని మండిపడ్డారు. పుల్వామా దాడిలో సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోతే కనీసం వారికి అమరుల హోదా కూడా ఇవ్వలేదని బహదూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏప్రిల్‌లో రూ.16 వేల కోట్లు ?

## టీడీపీ భారీ ఆశలు



**రాజధాని వార్తలు, అమరావతి :** ఏపీలో ఎన్నికలు హెూరాహెూరీగా సాగుతుండగా, ఏప్రిల్ నెలలో ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పింఛన్ల పెంపు, పసుపు-కుంకుమ చెక్కుల చెల్లింపులకు తోడు గత ఎన్నికల హామీ రైతు రుణమాఫీ చివరి విడత చెల్లింపులపై టీడీపీ సర్కారు ఆశలు పెట్టుకుంది. ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లు, రైతు రుణమాఫీ చెల్లింపులు, పసుపు-కుంకుమ చెక్కుల చెల్లింపులు.. ఏప్రిల్ మొదటివారంలో ఏపీ ప్రభుత్వ ఖజానా నుంచి ఆయా పద్దుల కింద చెల్లించాల్సిన మొత్తం అక్షరాలా రూ. 20 వేల కోట్ల రూపాయలు. వారం రోజుల్లో ఈ మొత్తం లబ్దిదారులకు సక్రమంగా చెల్లిస్తే ఓటర్ల మొగ్గు తమవైపే ఉంటుందని టీడీపీ భారీ అంచనాలే పెట్టుకుంది. విభజన తర్వాత రెవెన్యూ లోటుతో సతమతమవుతూ అప్పుల్లో కూరుకుపోతున్న ఏపీకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గుదిబండగా మారుతున్నాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు తోడు తాజాగా ప్రకటించిన పథకాలు ప్రభుత్వ ఖజానాకు భారంగా మారాయి. దీంతో ఎన్నికల వేళ నానాటికీ అధికారులపై ఒత్తిడి పెరిగిపోతోంది. గత ఎన్నికల హామీ రైతు రుణమాఫీ చివరి విడత చెల్లింపులు టీడీపీ సర్కారుకు కీలకంగా మారాయి. వీటికి మార్చినెల ఉద్యోగుల జీతభత్యాలు అదనం. కేవలం జీత భత్యాల కింద 4 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుండగా. రుణమాఫీ చివరి విడత చెల్లింపుల కోసం మరో 8 వేల కోట్లు, పసుపు- కుంకుమ పథకం చివరి విడత చెక్కుల చెల్లింపు కోసం 3 వేల కోట్లు, పింఛన్ల కోసం మరో 5 వేల కోట్లు ఖర్చు కానున్నాయి.ఏప్రిల్ మొదటి వారంలో ఈ మొత్తం చెల్లింపుల కోసం 20 వేల కోట్ల రూపాయలు ఒకేసారి ఖర్చుపెట్టాల్సి రావడంతో ప్రభుత్వ ఖజానా అధికారులతో పాటు బ్యాంకులపైనా ఒత్తిడి అంతకంతకూ పెరుగుతోంది. దీనికి తోడు బ్యాంకులకు ఈనెల 31న ఆదివారం పనిదినంగా ప్రకటించిన ఆర్బీఐ.. ఏప్రిల్ 1న సెలవు ఇచ్చింది. దీంతో ఆ రోజు బ్యాంకుల్లో ఉద్యోగులు విధుల్లో ఉండరు. 20 వేల కోట్ల రూపాయల్లో ఆన్ లైన్ పేమెంట్లను ఎలాగోలా సర్దుబాటు చేయగలిగినా... నేరుగా బ్యాంకుల్లో చెల్లించే పేమెంట్ల విషయంలో ఇబ్బందులు తప్పేలా లేవు. కొన్నేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల లబ్దిదారులకు చెల్లించే మొత్తాలను ఖజానా ద్వారా బ్యాంకుల్లో జమ చేస్తున్నారు. దీంతో లబ్ది దారులు నేరుగా బ్యాంకులకు వెళ్లి డబ్బులు తీసుకుంటున్నారు.

# బై..బై..చంద్రబాబు : షర్మిల



**రాజధాని వార్తలు, అమరావతి :** వైఎస్ షర్మిల మళ్లీ మైకు పట్టుకున్నారు. రెండురోజుల క్రితం విలేకరుల సమావేశాన్ని నిర్వహించిన ఆమె.. ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్మార్గ పాలన.. వైఎస్ దేవుడి పాలనను గుర్తు చేసింది. 2014లో రైతు రుణమాఫీలు పూర్తిగా చేస్తామని అధికారంలోకి వస్తే తన తొలిసంతకం రుణమాఫీ ఫైలుమీదే ఉంటుందన్న చంద్రబాబు తొలి హామీకే దిక్కులేదని, పసుపు కుంకుమ పేరుతో మహిళలను మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీలో పలు హాస్పిటల్లను లిస్టు నుంచి తీసేసి పేదలకు అన్యాయం చేశారని, బాబు వస్తే జాబు వస్తుందనే ప్రచారం చేసి తన కుమారుడు లోకేష్‌కు మాత్రమే ఉద్యోగం కల్పించారని విమర్శించారు. జయంతికి వర్ధంతికి తేడా తెలియని లోకేష్‌కు ఏం అనుభవం ఉందని మూడు శాఖలు కేటాయించారని నిలదీశారు. చంద్రబాబుకు నిజం చెప్పడం చేతకాదు. ఆయన ఏ రోజైతే నిజం చెబుతారో ఆరోజు చంద్రబాబు తల వేయి ముక్కలు అవుతుంది . అందుకే బాబు నిజం చెప్పరని, హైదరాబాదులో ఉంటే కేసులు పెడతారేమోనని విజయవాడకు పారిపోయి వచ్చారని ఎద్దేవా చేశారు. హరికృష్ణ మృతదేహం ముందు టీఆర్ఎస్తో పొత్తు పెట్టుకుంటామని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడేమో వైసీపీతో పొత్తు పెట్టుకుంటోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. సింహంలా సింగిల్‌గా వస్తున్న వైసీపీ బంపర్ మెజార్టీతో గెలవనుందని, దేశంలో అన్ని సర్వేలు ఇదే విషయాన్ని చెబుతున్నాయన్నారు.మాకు ఎవరితోను పొత్తు పెట్టుకునే అవసరం దాపురించలేదని ఆమె స్పష్టం చేశారు. పొరపాటున కూడా ప్రజలు తమ భవిష్యత్తును చంద్రబాబు చేతిలో పెడితే నాశనమేనని, విలువలతో కూడిన రాజకీయాలు చేసే జగన్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని ఆమె అభ్యర్థించారు.తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయి పదేళ్లు కావొస్తున్నా.. ఇప్పటికి ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాల మీద చర్చ జరుగుతుందని.. ఇప్పటికి ప్రజల మనసుల్లో వైఎస్ నిలిచిపోయినట్లుగా చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆయన కుమారుడు మంత్రి లోకేశ్ కు బైబై చెప్పాల్సిన టైం వచ్చేసిందని బైబై బాబు - బైబై పప్పు అని వ్యాఖ్యానించి కార్యకర్తల్లో.. అభిమానుల్లో జోష్ ను నింపుతున్నారు.

### నేడు గుంటూరులో షర్మిళ బస్సు యాత్ర

ఎన్నికల ప్రచారంలో వైసీపీ నేత షర్మిళ బిజీబిజీగా ఉన్నారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ఆమె ఉన్నారు. పలు రోడ్ షోలలో ఆమె పాల్గొననున్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో వైసీపీ నిర్వహించే బస్సుయాత్రలో షర్మిళ పాల్గొననున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## వైసీపీలోకి టీడీపీ కేంద్ర మాజీమంత్రి ?



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆ జాబితాలో కేంద్ర మాజీమంత్రి, ఆరు సార్లు ఎంపీగా గెలిచిన సాయి ప్రతాప్ కూడా ఉన్నారు. కాంగ్రెస్ తరపున రాజంపేట ఎంపీగా ఆరుసార్లు గెలుపొందిన సాయిప్రతాప్... 2009 ఎన్నికల్లో గెలిచిన తరువాత కేంద్రంలో మంత్రి కూడా అయ్యారు. అయితే ఆ తరువాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించడంతో పరిణామాలు మారిపోయాయి. 2011లో కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసిన సాయిప్రతాప్... 2014లో రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉన్నారు. వైఎస్ఆర్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఆయన వైసీపీలో చేరతారని భావించినా... ఆయన మాత్రం 2016లో టీడీపీలో చేరిపోయారు. రాజంపేట నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలిచిన సాయిప్రతాప్...టీడీపీ తరపున మళ్లీ ఎంపీగా పోటీ చేస్తారని చాలామంది భావించారు. అయితే టీడీపీ నుంచి ఆయన పోటీ చేసే అవకాశం రాలేదు. రాజంపేట ఎంపీ అభ్యర్థి కోసం అన్వేషిస్తున్న టీడీపీ... ఇందుకోసం సాయిప్రతాప్ పేరును పరిగణనలోకి కూడా తీసుకోలేదు. మాజీ ఎంపీ ఆదికేశవులునాయుడు భార్య, టీడీపీ ఎమ్మెల్యే సత్యప్రభకు రాజంపేట ఎంపీ టికెట్ ఇచ్చింది. దీనిపై అసంతృప్తితో ఉన్న సాయిప్రతాప్... అనుచరులతో చర్చించిన తర్వాత వైసీపీలో చేరతారని ఊహాగానాలున్నాయి.

# రాజధాని వార్తలు కలం

## వ్యక్తిత్వంపై మరక మంచిది కాదు

ప్రతి పౌరుడికీ ఈ సమాజంలో హక్కులతోపాటు, బాధ్యతలు కూడా ఉంటాయి. అవి సక్రమంగా వినియోగించుకుంటే సమాజం పురోగతి సాధిస్తుంది... దుర్వినియోగం అయితే పౌరసమాజం నిర్వీర్యమవుతుంది. ఈ ప్రాథమిక సూత్రం అందరికీ తెలిసిందే.. బాధ్యతలు-హక్కులపై మరింత లోతైన విశ్లేషణతో కూడిన పాఠ్యాంశాలు, నిబంధనావళిపై అత్యున్నత సర్వీసులైన ఐఏఎస్,ఐపీఎస్‌లకు భారత ప్రభుత్వం మరింత శిక్షణ ఇస్తుంది. దానికి కారణం మేలైన, పరిపాలనా సౌలభ్యం కోసమని వేరే చెప్పనక్కర్లేదు. అలాంటి అత్యున్నత అధికారులు తమ శక్తి యుక్తులను ప్రజల కోసం కాకుండా వ్యక్తులకు, రాజకీయ నాయకులకు ఉపయోగించడం ఎంత దౌర్భాగ్యం ? ఒక్కసారి వారి ప్రారంభ జీవితాన్ని గుర్తుకు తెచ్చుకుని ఈ సమాజం వారికిచ్చిన గుర్తింపు, గౌరవం, అధికారం, స్థాయి, సౌకర్యాలను పరిగణలోకి తీసుకుంటే ఎంతో నిండైన, తృప్తికర జీవితాన్ని కొనసాగించగలుగుతారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం అధికారాన్ని దుర్వినియోగం చేసుకుంటే ప్రజల ముందు ఎంత చులకన కావాల్సి ఉంటుందో రాబోయే తరాలు తెలుసుకోవాలి. ఇంటెలిజెన్స్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు తన పరిధి దాటి వ్యవహరించడంతో భారత ఎన్నికల కమిషన్ ఆయనను విధుల నుంచి తొలగించడంపై రాష్ట్రంలో జరిగిన రాద్ధాంతం వల్ల ఈ విషయం ప్రస్తావించ వలసి వస్తోంది.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ శిక్షకాదని నిబంధనావళి పేర్కొంది. మూడేళ్ల కంటే ఎక్కువ కాలం ఒకే ప్రదేశంలో ఉద్యోగం చేయడం దాదాపుగా కుదరదు. కాబట్టి కాలపరిమితికి లోబడి బదిలీలకు గురయితే అది వారి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం కాదనేది సుస్పష్టం. అలాగే ఎన్నికల సమయంలో ప్రలోభాలకు, కుల, మత, ప్రాంతీయ తత్వాలతో అధికార దుర్వినియోగానికి పాల్పడటానికి అవకాశం ఉందని ఎన్నికల సంఘం భావిస్తే తాత్కాలికంగా వారిని విధుల నుంచి తప్పించడం సర్వసాధారణం. ఈ నియమం ఉద్యోగులందరికీ తెలిసిందే.. ఈ బదిలీలను కారణంగా ఎన్నికల సంఘాన్ని లక్ష్యం చేసుకోవడం. లేదా ఫిర్యాదు చేసిన వారిపై యుద్ధానికి దిగడం వల్ల వారిపై ఆరోపణలకు బలం చేకూర్చుతుందికాని, ఎన్నికలు సజావుగా జరగడానికి ఉపయోగపడదనేది సుస్పష్టం. ఎన్నికల సంఘం ఏక పక్షంగా వ్యవహరించిందని, దానికి ఆ అధికారం లేదని, ప్రభుత్వంపై పెత్తనం చెలాయిస్తోందని గోలపెట్టడం సరికాదు. ఎందుకంటే ఎన్నికల ప్రకటన వెలువడంగానే ఆయా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆపద్ధర్మ ప్రభుత్వాలుగా మారుతాయన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ పరిస్థితిలో అరచి గోలపెట్టి, పోలీసులకు ఫిర్యాదులు చేయడం వల్ల రాష్ట్రంలో ఏదో జరగకూడనిది జరుగుతుందన్న భావన ప్రజల్లో కలిగించిన వారవుతారు. ఇప్పటికే అనేకచోట్ల పోలీసులు డబ్బు పంచడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది దీనిపై ప్రభుత్వం ఏం చెబుతుంది ? ఏది ఏమైనా కోర్టులు సకాలంలో స్పందించి ఈసీ నిర్ణయాల్లో మేం తలదూర్చం అని తేల్చిచెప్పడం ద్వారా సమస్యను పరిష్కరించడం ముదావహం.

వాస్తవానికి వైఎస్ మొదటిసారి ఐదేళ్లు పాలనను పూర్తిచేసుకొని ఎన్నికలకు వెళుతుండగా ప్రతిపక్షంలో ఉన్న ఇదే చంద్రబాబు అప్పటి డీజీపీ యాదవ్‌పై ఫిర్యాదు చేయడంతో ఎన్నికల సంఘం ఆయనను తొలగించి పీకే మహంత్‌కు డీజీపీ బాధ్యతలను అప్పగించిందని రాష్ట్ర పోలీసులు గుర్తుకు తెచ్చుకోవాలి. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ అడ్డాల వెంకటరత్నం, ఎస్ఐగా చేరి ఎస్పీస్థాయికి చేరుకున్నారు. ఆయన ఇప్పటివరకు ఎన్ని ఎన్నికలను చూసి ఉంటారు ? ఆయనకు ఎన్నికల నియమ నిబంధనలు తెలియనివి కావుకదా అయినప్పటికీ శ్రీకాకుళం టూటౌన్ సీఐకు ఫిర్యాదు చేయడం ఎంత బాధ్యతారాహిత్యం ?కడప ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మలు ఇదే బాటలో ప్రయాణించడాన్ని ఏమనుకోవాలి ? ఆపద్ధర్మ ప్రభుత్వం వీరికి అనుగుణంగా జీవోలు చేయడం ఎంత అవివేకం ?

ఏది ఏమైనా ఉద్యోగులు తమ సర్వీసుల్లో ఎన్నో ప్రభుత్వాలను చూస్తారు.. వారికుండాల్సింది ప్రభుత్వ విధేయత కాదు.. ప్రజా విధేయత.. ఉద్యోగులు దారితప్పి ప్రజలు అందిస్తున్న వేతన భత్యాలు,సౌకర్యాలను కాదని అధికార పార్టీలకు తొత్తులుగా మారితే అది వారి వ్యక్తిత్వానికే మరకగా మారుతుంది. రానున్న కాలంలో అందుకు తీరిగ్గా పరితాపం చెందాల్సి ఉంటుంది.

# దూసుకొస్తున్న దళిత తేజం



**ఆందోళనలో మాయావతి**

**భారతదేశంలో అత్యంత వెనుకబడిన కులాల వారిగా పరిగణించే దళితుల (గతంలో అంటరానివారు) నుంచి వచ్చిన చరిష్మా గల యువ నాయకుడు చంద్రశేఖర ఆజాద్ ఈ ఎన్నికల్లో తన స్వరం వినిపించాలని ప్రయత్నిస్తున్నారు. అందుకోసం నేరుగా ప్రధాని మోడీతో ఆయన ఇలాకాలోనే తలపడుతుడూ సవాల్ చేస్తున్నాడు. ఇది బైబిల్‌లో వర్ణించిన దావీదు వర్సెస్ గొల్యాత్ పోరాటాన్ని తలపిస్తోంది.**

వారణాసి నుంచి 2014లో 3 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచిన మోడీకి ఆజాద్ గట్టి పోటీనిచ్చే పరిస్థితి లేదు. అయితే, ఇక్కడ ఆజాద్ లక్ష్యం గెలవడం కాదు.తద్వారా తన గొంతు వినిపించే అవకాశాన్ని దక్కించుకోవడం ఆయనకు ముఖ్యం.మోడీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని భీమ్ ఆర్మీ నాయకుడు ఆజాద్ పిలుపునిచ్చాడు. ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయ బోతున్నారు.భారతదేశపు సంకుచిత కుల వ్యవస్థలో అట్టడుగు కులాలైన దళితులకు చిరకాలంగా పౌర స్వాతంత్ర్యం, గౌరవమర్యాదలు నిరాకరించారు. ఆ వర్గం నుంచి ఆజాద్ మూడేళ్లలో ఓ ప్రముఖ నాయకుడిగా ఆవిర్భవించాడు.

ఆయన కారు పార్లమెంటు స్ట్రీట్‌కు చేరుకోగానే... ఆయన మద్దతుదారులు పార్టీ నీలి రంగు జెండాను పైకెత్తి "జై భీమ్" అంటూ నినాదాలు చేశారు. భీమ్ అంటే, భారత స్వాతంత్ర్య సమరయోధుడు, దళిత నాయకుడు భీమ్‌రావ్ అంబేడ్కర్.

ఆజాద్ కారు నుంచి దిగగానే, యువకులు ఆయనను చుట్టుముట్టారు. ఆయనతో కరచాలనం చేయటానికి, సెల్ఫీ తీసుకోవటానికి చాలా మంది ప్రయత్నించారు. గత వారం ఆరంభంలో ఆయన తన సొంత పట్టణం ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్ నుంచి మోటార్‌సైకిళ్లతో భారీ ప్రదర్శనగా ఢిల్లీకి బయలుదేరారు. కానీ అన్ని బైకులతో వెళ్లటానికి ఆయనకు అనుమతి లేదంటూ పోలీసులు ఆజాద్‌ను ఆపివేశారు.ఆ సందర్భంగా జరిగిన తోపులాటలో ఆజాద్ అనారోగ్యానికి గురయ్యారు. ఆ మరుసటి రెండు రోజులూ ఆస్పత్రిలో గ్లూకోజ్ తీసుకుంటూ గడిపారు. "మోడీ 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల మీద అత్యాచారాలు పెరిగిపోయాయి. మేం ఆయనను మళ్లీ ఎన్నుకోవటం అవివేకం అవుతుంది' అన్న ఆయన' మోడీని ఓడించడానికి నేను బనారస్ (వారణాసి) వెళుతున్నాను. అందుకు మీ మద్దతు అవసరం. దళిత వ్యతిరేకతకు శిక్ష అనుభవించక తప్పదని మోడీ తెలుసుకోవాలి" అని ఆజాద్ చెప్పారు.

ప్రధానమంత్రికి వాస్తవికతతో సంబంధాలు తెగిపోయాయి. అత్యాచారానికి పాల్పడ్డ వారిని మూడు రోజుల్లో ఉరితీయటం జరిగిందంటూ "అబద్ధాలు" చెప్తున్నారని ఆయన మండిపడ్డారు.ఒక దళిత మహిళ అత్యాచారానికి గురైతే పోలీసులు 40 రోజుల పాటు ఆమె ఫిర్యాదును కూడా నమోదు చేయరు" అన్నారు.

మంచి నీరు తాగినందుకు, బల్లలు శుభ్రం చేయనందుకు దళిత బాలురను తరచుగా కొడుతున్న ఒక కాలేజీలో కుల అణచివేత మీద పోరాటం కోసం 2015లో ఆయన భీమ్ ఆర్మీని స్థాపించారు. ఆజాద్ సొంత పట్టణం షహరాన్‌పూర్‌లో దళితులు - అగ్రకుల ఠాకూర్ల మధ్య హింసాత్మక ఘర్షణ జరిగినపుడు భీమ్ ఆర్మీ ప్రచారంలోకి వచ్చింది.

ఆజాద్‌ను కఠినమైన జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్ చేశారు. ఆయన దాదాపు 16 నెలల పాటు జైలులో గడిపారు. జైలులో ఉండటం వల్ల ఆయన ప్రజాదరణ తరిగిపోలేదు. నిజానికి ఆయన సమాజానికి ఆయనను మరింత ఆప్తుడిని చేసింది.మేం శాంతినే నమ్ముతాం. కానీ మేం పిరికివాళ్లం కాదు.

**చెప్పులు ఎలా కుట్టాలో మాకు తెలుసు. వాటితో ఎలా కొట్టాలో కూడా మాకు తెలుసు" అని చెప్పారు.**

దళితులకు సంప్రదాయంగా కేటాయించిన కులపరమైన పాత్రలను, దానితో పాటు ఉండే సంకేతాలను నిరంతరం సవాల్ చేస్తుండటం ఆయనను ఆ ప్రజలకు దగ్గర చేస్తోంది.

ఓ గ్రామం వెలుపల 'ది గ్రేట్ చమార్' అని రాసిన ఒక బోర్డు పక్కన నిలబడివున్న అతడి ఫొటోతో.. ఆజాద్ మొదటిసారి ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఆ బోర్డు ద్వారా ఆ దూషణను ఒక గౌరవంగా మార్చేశారాయన.ఫొటోల్లో ఆయన తరచుగా తన మీసం మెలివేస్తున్నట్లు, చలువ కళ్లద్దాలు ధరించి, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్ నడుపుతూ కనిపిస్తుంటారు. ఇది సమాజంలో యువకులు, ఔత్సాహికులకు ఆయనను చాలా సన్నిహితుడిని చేసింది. ఆయనను ఒక ఫ్యాషన్ ఐకాన్‌గానూ మార్చింది. ఢిల్లీ సభలో 20ల, 30ల వయసు యువకులు చాలా మంది సన్‌గ్లాసెస్ ధరించి, మెలి తిప్పిన గుబురు మీసాలతో కనిపించారు.ఆయన చెప్పిన పార్టీకి లేదా అభ్యర్థికే ఓటు వేస్తామని చాలా మంది నిర్ణయించుకున్నారు.

ఉత్తరప్రదేశ్‌లో నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన దళిత నాయకురాలు మాయావతికి ఆందోళన కలిగిస్తోంది. అతడు "బీజేపీ ఏజెంట్" అని, దళిత ఓట్లను చీల్చటం కోసం పనిచేస్తున్నారని ఆమె ఆరోపించారు.ఈ ఆరోపణను ఆజాద్ తిరస్కరించారు. అధికార పార్టీని తాను వ్యతిరేకిస్తున్నాననేందుకు వారణాసిలో మోడీపై పోటీ చేస్తుండటమే రుజువని చెప్తున్నారు. దేశాన్ని బీజేపీ నుంచి, ఆ పార్టీ అగ్ర కుల సిద్ధాంతం నుంచి విముక్తం చేయటమే తన ఏకైక లక్ష్యమని చెబుతున్నారు.

'ఇరవై ఒకటో శతాబ్దం దళితులకే చెందుతుందని బాబా సాహెబ్ (భీమ్‌రావ్ అంబేడ్కర్) చెప్పారు. కాబట్టి 2019లో మేం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని నేను అనుకుంటున్నాను. అప్పుడు కాకపోతే 2024లో తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం" అని చెబుతున్నారు.'అగ్రకులాలు మమ్మల్ని 3,000 సంవత్సరాల పాటు తమ సేవకులుగా చూశాయి. ఇక అలా జరగదు" అని ఆజాద్ ఉద్ఘాటించారు.

– ఖాన్



ప్రజలనుద్దేసించి మాట్లాడుతున్న చంద్రశేఖర ఆజాద్



చంద్రశేఖర ఆజాద్‌ను హాస్పటల్‌లో పరామర్శిస్తున్న ప్రియాంకా గాంధీ

### మాయావతికి తగ్గిన ఓటు బ్యాంకు



ప్రస్తుతం మాయావతి వెనుక ఉన్న దళిత ఓటు బ్యాంక్ తగ్గిపోవడమే కాదు, ప్రస్తుతం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు వ్యూహాత్మకంగా వ్యవహరించి, విపక్షాలను దెబ్బ కొట్టడానికి పెద్ద నోట్లను రద్దు చేసింది. దీంతో బీఎస్పీ తన వద్ద ఉన్న వందల కోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేయాల్సి వచ్చింది. అవి విరాళాల రూపంలో వచ్చాయా లేక ఇతర చోట్ల నుంచి వచ్చాయా అన్న అంశం ప్రస్తుతం ఆదాయ శాఖ పరిధిలో ఉంది.మరోవైపు ఆమెపై ఆదాయానికి మించి ఆస్తుల కేసును ఇంకా మూసేయలేదు. ఆమె ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చక్కెర మిల్లులను అతి తక్కువ ధరకు అమ్మేశారన్న కేసూ కోర్టులో ఉంది.ఆమె సోదరుడు ఆనంద్ కుమార్ నకిలీ కంపెనీల్లో భారీగా పెట్టుబడులు పెట్టాడన్న కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో బీఎస్పీ మిత్రపార్టీలు మన రాష్ట్రంలో ఎన్ని సీట్లు గెలుచుకుంటాయన్నది ప్రశ్నార్థకమే..

# పూలబాటా.. ముళ్ళ బాటా!?

(మొదటిపేజీ తరువాయి)

అనుకోవడం సరైనది కాదని వీరి అభిప్రాయం. కాగా, 2014 ఎన్నికలలో రామకృష్ణారెడ్డికి కూడా ఇది కొత్త నియోజకవర్గమే కదా అని వారు అంటున్నారు. రామకృష్ణారెడ్డి పెద్ద నాయకుడు కాదు. తెలుగుదేశం అభ్యర్థిపై కేవలం 12 ఓట్ల తేడాతో మాత్రమే గెలుపొందారనే విషయం గమనించాలని వీరు అంటున్నారు. ఈ నియోజకవర్గాన్ని వైకాపా ప్రాబల్యం ఉన్న నియోజకవర్గం గా భావించలేమని వీరి వాదన. లోకేష్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించకపోతే వైకాపా ఇక్కడినుంచి రామకృష్ణారెడ్డిని నిలిపేది కాదనేది బహిరంగ సత్యమే.

చేనేత వర్గాలలో ప్రభుత్వంపై ఒకప్పుడు వ్యతిరేకత ఉన్న మాట నిజమైనా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వల్ల కొంత మార్పు వచ్చిందని పార్టీ విశ్లేషకుల వాదన. చేనేత వృత్తుల వారికి ముఖ్యంగా మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న చేనేత వృత్తుల వారికి ప్రభుత్వం పెన్షన్ లు మంజూరుచేసిన విషయాన్ని వీరు గుర్తు చేస్తున్నారు. చేనేత వృత్తుల వారికి నూలు కొనుగోలుకు రాయితీలు ఇవ్వడం మరమగ్గాలకు వాడే విద్యుత్తుకు 50% సబ్సిడీలు ఇవ్వటం వీరు ప్రస్తావిస్తునారు.

రాజధాని ప్రాంతాలలో ఉన్న కీలకప్రాంతంలో ఉన్న మంగళగిరిని ఒకదశలో రాజధానిగా ప్రకటించాలనే ప్రతిపాదనకూడా వచ్చిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. రాజధాని ప్రాంతంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మంగళగిరిలో లోకేష్ చొరవతో ఐటీ కంపనీలు ప్రారంభమయ్యాయని, పెద్ద సంఖ్యలో కాకపోయినా ఉద్యోగావకాశాలు వచ్చాయని విశ్లేషకులు చెప్తున్నారు. మంగళగిరి ప్రాంతంలో నైపుణ్యాభివృద్ధి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలలో అనేకమందికి శిక్షణ యిచ్చిన విషయాన్ని వీరు ప్రస్తావిస్తున్నారు.

ఈ అభిప్రాయాలను అంగీకరిపలేనివారు పార్టీలోనే ఉన్నారు. రామకృష్ణారెడ్డి కొత్తవాడైనా, ప్రతిపక్షంలో ఉన్నా తన సొంత స్థాయిలో సంక్షేమ పథకాలను నిర్వహించి ప్రజల మెప్పుపొందారని వీరి వాదన. రాజధానికి భూసేకరణ సమయంలో భూసేకరణను వ్యతిరేకిస్తున్న రైతులకు అండగా ఉండి వారి అభిమానాన్ని పొందారని వీరు చెబుతున్నారు. ఇంతే కాక రైతులలో ఉన్న వ్యతిరేకతను భారీ స్థాయిలో ప్రచారం చేసిన విషయాన్ని కూడా మరిచిపోరాదని వీరి వాదన.

ఇప్పటికే అభివృద్ధి బాటలో ఉన్న మంగళగిరిలో లోకేష్ ప్రమేయంతో అభివృద్ధి వేగవంతం అవుతుందని పార్టీ నాయకులు అంటున్నారు. మంగళగిరిని మరొక గచ్చిబౌలిగా తీర్చిదిద్దగలమని ఎన్నికల ప్రచార సభలలో లోకేష్ చేసిన వాగ్దానానికి మంచి స్పందన వచ్చిందని పార్టీ నాయకుల అభిప్రాయం. ముఖ్యంగా ఈ ప్రకటన యువతలో ఉత్సాహాన్ని తెచ్చిందని వీరు అంటున్నారు. ఈ నియోజకవర్గంలో లోకేష్ గెలుపు నల్లేరుపై బండి కాకపోయినా కష్టపడితే ఖచ్చితంగా విజయం సాధించవచ్చునని వీరి నమ్మకం.

కాగా జనసేన తరపున కమ్యూనిస్టు అభ్యర్థి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పోటీలో ఉండడం ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడంలో తోడ్పడుతుందని పరిశీలకుల అభిప్రాయం. లోకేష్ విజయావకాశాలు మెరుగుపరచాడానికే ఈ స్థానాన్ని జనసేన పొత్తులో ఉన్న కమ్యునిస్టులకిచ్చిందని వీరి అభిప్రాయం.

వైకాపా కూడా ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. చేనేత వర్గానికి చెందిన కమల వైకాపాకు అండగా ఉండడం తమకు కలసివచ్చే అంశమని వైకాపా నాయకుల విశ్వాసం. ఈ ప్రాంతంలో ఉన్న రైతుల వ్యతిరేకతను ఉపయోగించుకోనడానికి వైకాపా ప్రత్యేక శ్రద్ధవహిస్తున్నది. మంగళగిరి ప్రాంతంలో జగన్మోహన్ రెడ్డి సోదరి షర్మిల విస్తృత ప్రచారం చేశారు. షర్మిల నిర్వహించిన ర్యాలీలకు మంచి స్పందన వచ్చింది. షర్మిల ర్యాలీలో అనేక మంది మహిళా నాయకులు పాల్గొనడం విశేషం.

రానున్న రోజులలో నియోజకవర్గంలో అధికార ప్రతిపక్ష నేతలు భారీ సభలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు విస్మరించి లోకేష్ విజయానికి కృషి చేస్తున్నారు. లోకేష్ ఇతర నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారాన్ని మానుకొని మంగళగిరి పైనే దృష్టి పెడితే మంచిదని తెలుగుదేశం అభిమానుల కోరిక.

### బ్యాలెట్ పత్రాల ముద్రణ ప్రారంభం : ద్వివేది



**రాజధాని వార్తలు, అమరావతి :** నవ్యాంధ్రలో ఏప్రిల్ 11న ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే ఈవీఎంలో ఉంచే బ్యాలెట్ పత్రాల ముద్రణ కూడా ప్రారంభించినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్లలో ఫొటోలు కూడా పెట్టాల్సి ఉన్నందున ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఒకటికి పదిసార్లు చెక్‌చేసి ముద్రణకు ఇస్తున్నట్లు తెలిపారు. కర్నూలు, గుంటూరు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య 30 వరకు ఉండడంతో మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగిస్తున్నట్లుతెలిపారు. పారదర్శకంగా ఓటింగ్ జరిగేలా ఏర్పాట్లు చెస్తున్నట్లు తెలిపారు.గత ఎన్నికల్లో పట్టణ ఓటింగ్ శాతం తక్కువగా ఉందని, అందువల్ల ఈసారి పట్టణ ఓటింగ్ అధికంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావు గెలుపు..



**రాజధాని వార్తలు, గుంటూరు:** ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ మరోసారి సత్తా చాటింది. కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల్లో పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు ఘన విజయం సాధించారు. గుంటూరులోని ఏసీ కాలేజీలో 12 రౌండ్లపాటు సుదీర్ఘంగా లెక్కింపు తర్వాత.. 68,120 ఓట్ల మెజార్టీతో లక్ష్మణరావు గెలుపొందారు. నూతలపాటి అంజయ్య 12,550 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎన్నికల్లో 1,49,319 ఓట్లు పోలైతే.. లక్ష్మణరావుకు 80,670 ఓట్లు వచ్చాయి. లక్ష్మణరావు భారీ ఆధిక్యంతో గెలుపొందడంతో అనుచరులు సంబరాలు చేసుకున్నారు. ప్రజా సమస్యలపై శానసమండలిలో గళం విప్పుతానన్నారు లక్ష్మణరావు. సమస్యల పరిష్కరించేందుకు తనవంతు క ృషిచేస్తానన్నారు. తనపై నమ్మంకంతో ఎమ్మెల్సీగా గెలిపించినందుకు క ృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మణరావు గతంలో రెండు సార్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.


## చీర నేసిన నారా లోకేశ్!



**రాజధాని వార్తలు, అమరావతి :** మంగళగిరి చేనేతకు అంతర్జాతీయ బ్రాండింగ్ కల్పిస్తామని ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏపీ బడ్జెట్ లో రూ.250 కోట్లతో చేనేత మార్కెటింగ్ నిధిని ఏర్పాటుచేయడంతో పాటు చేనేత వస్త్రాల వినియోగం పెరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని రత్నాలచెరువులో టీడీపీ లోక్ సభ అభ్యర్థి గల్లా జయదేవ్ తో కలిసి లోకేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.అప్కో పెండింగ్ బకాయిల సత్వర విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అభివృద్ధి పనుల కోసం వినతిపత్రాలు ఇచ్చానా? లేదా?

**లోకేశ్! ఆ విషయం గురించి మీ నాన్నను అడుగు**



**రాజధాని వార్తలు, మంగళగిరి :** మంగళగిరి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని చెబుతున్న నారా లోకేశ్ వెళ్లి తన తండ్రిని ఈ విషయమై ప్రశ్నించాలని వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే సూచించారు. మంగళగిరిలో నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం వినతిపత్రాలు ఇచ్చానా? లేదా? అన్న విషయాన్ని లోకేశ్ తన తండ్రిని అడగాలని సూచించారు. ఇక్కడి నుంచి పోటీ చేయాల్సింది లోకేశ్ కాదని చంద్రబాబు అని అన్నారు. ఈ రాష్ట్రాన్ని, ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని చెప్పదలచుకుంటే చంద్రబాబు పోటీ చేసి ఉండాల్సిందని అన్నారు. తనపై పోటీ చేస్తే ఓడిపోతానని చంద్రబాబుకు తెలుసని, ఎందుకంటే, గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో ఏ ఒక్క రోజైనా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నారా? ఈ నియోజకవర్గం అభివృద్ధి కోసం అధికారులతో కలిసి ముఖ్యమంత్రి సమీక్షలు జరిపారా? అని ప్రశ్నించారు. ఇదే నియోజకవర్గంలో అక్రమంగా ఒక ఇంటిని ఆక్రమించుకుని చంద్రబాబు బతుకున్నాడని తీవ్ర ఆరోపణలు చేశారు.

# ఓటర్ వెబ్‌సైట్‌లు, యాప్‌లు, స్మార్ట్‌సేవలు..




**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఎన్నికలకు సాంకేతిక పరిజ్ఞానం తోడయ్యింది. ఎన్నికల సంఘం రూపొందించిన నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్‌తో ఓటుహక్కు నయోదు, సువిధ, సీవిజిల్ యాప్‌లతో ఫిర్యాదులతో పాటు సమాచారం లభిస్తున్నది.స్మార్ట్ పోన్ వినియోగంతో వివిధ అంశాలను తెలుసుకోవడం ఓటర్లుకు, పోటీ చేసే అభ్యర్థులకు సునాయాసమైనంది. ఎన్నికల నిర్వాహణకు సంబంధించి ఎన్నికల సంఘం రూపొందించిన వెబ్‌సైట్, యాప్‌ను విశేష ప్రజాదరణ లభిస్తున్నది.

**సువిధ యాప్**

అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు సువిధ యాప్ ద్వారా అధికారులు అనుమతులు ఇస్తున్నారు. అభ్యర్థుల ప్రచార వాహనాల రిజిస్ట్రేషన్ సంఖ్య, డ్రైవర్ వివరాలను ఈ యాప్ ద్వారానే నయోదు చేస్తున్నారు. అదేవిధంగా బహిరంగ సభలకు సంబంధించిన పోలీసు అనుమతులు ఈ యాప్ ద్వారానే లభిస్తున్నాయి. బహిరంగ సభల నిర్వహణకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసిన వెంటనే అధికారులు 24గంటల్లో అనుమతులను ఇచ్చేందుకు సువిధ యాప్ ఉపయోగపడుతుంది.

**పోలింగ్ కేంద్రాల చిరునామా..**

ఎన్నికల సమయంలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలను తెలుసుకునేందుకు గతంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పోలింగ్ కేంద్రం చిరునామా సరిగా తెలియక ఓటర్లు ఓటు వేయకుండానే తిరిగి వచ్చేవారు. దీంతో ఓటర్లు ఓటు పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు మ్యాప్ డాటా యాప్‌ను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. ఈ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ఓట్లు వేసే పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవచ్చు.

**ఆన్‌లైన్‌లోనే ఓటరు జాబితా**

ఓటరు జాబితాలో తమ పేరుపై సందేహాలు నివృత్తి చేసుకునేందుకు సీఈవో పేరుతో యాప్‌ను ప్రారంభించింది. స్మార్ట్ ఫోన్‌లో సీఈవో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఓటరు జాబితాలో తమ ఓటు హక్కు ఉందో లేదో తెలుసుకోవచ్చు.

**ఓటరు నమోదు సులదు సులభం**

18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు తాజాగా ఎన్నికల సంఘం నేషనల్ ఓటరు సర్వీస్ పోర్టల్ యాప్‌ను ప్రారంభించింది. ఓటు హక్కు నమోదు చేసుకునే వ్యక్తులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి నుంచే ఓటు హక్కును పొందేందుకు ఈ సర్వీస్ పోర్టల్ యాప్‌లో మన దరఖాస్తు ఏ స్థితిలో ఉందో కూడా తెలుసుకోవచ్చు. అధికారులు దరఖాస్తును ఆమోదించిన వెంటనే ఓటరు గుర్తింపు కార్డును సర్వీస్ పోర్టల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు.

**వీవీప్యాటీ**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు రాకముందు ఓటర్లు పోలింగ్ చిట్టీలపై ఓటు వేసేవారు. తర్వాత ఈవీఎం యంత్రాల సహాయంతో తమ ఓటును నమోదు అయిందో తెలుసుకోలేక ఓటర్లు అయోమయానికి లోనవడం, ఈవీఎం పారదర్శకతపై పార్టీల నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో.. ఎన్నికల సంఘం వీవీప్యాట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా పోలింగ్ కేంద్రంలో ఓటరు తన ఓటు వేసిన పార్టీకే నమోదు అయిందా? లేదా..అన్న అనుమానాన్ని నివృత్తి చేసుకునే అవకాశం కలిగింది.

# ప్రచార కూలీలు

## భుజంపై కండువా..తలపై టోపీ..చేతులో జెండాలు





**రాజధాని వార్తలు, అమరావతి :** ఆయా పార్టీలకు చెందిన కార్య కర్తల సంఖ్య తగ్గిపోతుండుగా ప్రచారంలో రోజువారీ కూలీల పాత్ర అధికమవుతోంది. ఎన్నికల వేళ ఎక్కడ చూసినా భుజంపై కండువా..తలపై టోపీ..చేతుల్లో కర పత్రాలతో గడపగడకూ తిరుగాడే రాజకీయ కూలీలకు డిమాండు పెరిగింది.మండు టెండను లెక్కచేయక... మేడలు.. మిద్దెలూ ఎక్కుతూ ఎన్నిలకు పుణ్యమా అని బతుకుబండి లాగించేస్తున్నారు. మా పార్టీలకు జనబలం ఎక్కువ, కార్యకర్తల గణం ఎక్కువ, పనిచేసే నేతలు తెక్కకు మించి ఉన్నారని చెప్పుకునే ఆయా పార్టీల నేడు ఎన్నికల ప్రచారాల కోసం రాజకీయ కూలీలను ఆశ్రయించాల్సి వస్తోంది. పలు పార్టీం తమ సభ్యత్వాల పేరుతో వేలాది మందిని సభ్యులుగా ఎన్ని సంఘానికి చూపిస్తున్నారు. అయితే ఈ సంఖ్య కేవలం రసీదులకే పరిమితం కాగా, కార్యకర్తలు ప్రచార కార్యక్రమాల్లో కానరాని దూరంలో ఉన్నారు. ఇంతకాలంగా ఆయా పార్టీల నేతలు, అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగివేసారిన నేతల గణం సైతం ప్రస్తుతం కనిపించడంలేదు.

**మహిళలే అధికం**

అన్ని పార్టీలకు ప్రధానంగా మారిన రాజకీయ కూలీలు... ముండుటెండల్లో రోజంతా రోజంతా తిరుగుతూ అలసి పోతున్నారు. మరికొందరు వడదెబ్బతో ఇబ్బందులు పడు తున్నారు. ఈ ఎన్నికలు కొందరికి ఒక బతుకు తెరువుగా మారాయి. ఆయా పార్టీల నేతలకు మాత్రం వీరిని ఒప్పించి మెప్పించి ప్రతినిత్యం అనుకున్న దానికంటే ఒక వంద ఎక్కువగానే ఇచ్చేలాగా మధ్యవర్తులతో బేరాలు కుదుర్చుకుని తిప్పుకుంటున్నారు. ఇటువంటి వారిలోనూ అధికంగా మహిళలే కనిపిస్తున్నారు. చిన్నా.. పెద్దా..వృద్ధులు కూడా ప్రచారపర్వంలో తిరుగుతుతున్నారు. ఓటర్లను కలుసుకొని ఆయా పార్టీల అభ్యర్థులకు ఓట్లేయ మని కూడా వీరే అభ్యర్థిస్తున్నారు. వీరి బాధ్యతలు ముఖ్య నేతలకు అప్పగించారు. అయితే ఈ ముఖ్యనేతలే వారి పాలిట శాపమై దళారులుగా మారి వారితో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన సొమ్ముకంటే తక్కువగానే చెల్లిస్తున్నారు. దీంతో కొందరు చేసేదేమీలేక వచ్చిందే చాలనుకుని సర్దుకుపోతున్నారు.

**కుల సంఘాల నేతలకు డిమాండ్**

అన్ని పార్టీల్లో ఎక్కడ చూసినా నియోజకవర్గాల్లోని ప్రధాన నేతలకూ డిమాండ్ బాగా పెరిగింది. ఆయా కుల సామాజిక వర్గాలకు నేతృత్వం వహించే కొందరు నేతలకు ఇంకా డిమాండ్ పెరుగుతోంది . పార్టీ ప్రచారాల్లో తమ వెంట ఆ ముఖ్యనేతలు, కులసంఘాల పెద్దలు తిరగాలంటూ ఆయా పార్టీల అభ్యర్థులు వేడుకుంటున్నారు. అయితే ఇందుకు తగ్గట్లుగా ఆ వ్యక్తులు కూడా అభ్యర్థుల నుంచి భారీగానే వసూలు చేస్తున్నారు.

## న్యాయస్థానాలపై గౌరవం ఉండాలి: ఉప రాష్ట్రపతి



**రాజధాని వార్తలు, విశాఖ :** న్యాయస్థానాలపై ప్రతి ఒక్కరూ గౌరవం కలిగి ఉండాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. విశాఖలో న్యాయస్థానాలు ఏర్పాటై 125 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో ఉపరాష్ట్రపతి శనివారం పాల్గొన్నారు. మాట్లాడుతూ.. విశాఖతో తన అనుబంధం విడదీయారనిదని పేర్కొన్నారు. తన ఎదుగుదల అన్ని విధాలా ఇక్కడి నుంచే ఆరంభమైందన్నారు. న్యాయస్థానాలకు 125 ఏళ్ల చరిత్ర ఉండడం ఎంతో విశేషంతో కూడుకున్నదని చెప్పారు. తెన్నేటి విశ్వనాథం వంటి మహానుభావులు ఇక్కడి నుంచే వ ృత్తి జీవితాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. దేశంలో 3.12 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. 130 కోట్ల భారతీయుల విశ్వాసాన్ని కోర్టులు నిరంతరం పరిరక్షిస్తూనే ఉన్నాయని కొనియాడారు.

## ఇచ్ఛాపురం పర్ఫెక్ట్ వాస్తు... కుప్పం వరకు మొత్తం మనదే: చంద్రబాబు ధీమా



**రాజధాని వార్తలు, శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. జనసంద్రాన్ని తలపిస్తున్న సభను చూడగానే చంద్రబాబు ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. సముద్రంలా కనిపిస్తున్నారని, తన జీవితంలో ఇంతటి జనస్పందన ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఇచ్ఛాపురం రాష్ట్రానికి తూర్పు, ఈశాన్యంగా ఉంటుందని, రాష్ట్రానికి పర్ఫెక్ట్ వాస్తు అని పేర్కొన్న చంద్రబాబు, ఇక్కడ పోటీచేస్తున్న అశోక్ టీడీపీ అభ్యర్థుల లిస్టులో మొదట ఉంటాడని, కుప్పంలో పోటీచేస్తున్న తాను చివర 175వ స్థానంలో ఉంటానని వివరించారు.

జాబితాలో మొదట, చివర ఉండే ఇద్దరు అభ్యర్థులం ఇప్పుడు ఒకే వేదికపై ఉన్నామని చమత్కరించారు. అంతేకాదు, ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు అన్నీ మనమే గెలుస్తున్నామంటూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కలిగించేలా మాట్లాడారు. ఇచ్ఛాపురం టీడీపీకి కంచుకోట అని చెప్పారు. ఒక్కసారి తప్ప ఇచ్ఛాపురంలో టీడీపీకి అనేక ఘనవిజయాలు లభించాయని అన్నారు. కుప్పం తాను వెళ్లకపోయినా 70 వేలు, 80 వేలు మెజారిటీ వస్తుంటుందని వివరించారు.

## 'చంద్రబాబూ.. నీ కరెంట్ పోయింది'



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** 'చంద్రబాబూ.. నీ కరెంట్ పోయింది. అందుకే తిక్కతిక్కగా మాట్టాడుతున్నారు' అని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ఎద్దేవా చేశారు. గతంలో రైతులకు ఉచిత విద్యుత్తు ఇస్తే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలన్న చంద్రబాబు.. ఇప్పుడేమో సైకిల్ చైన్ ముట్టుకుంటే కరెంట్ షాక్ కొడతుందంటున్నాడని, అసలు ఫ్యూజులు ఎగిరిపోయి ఆయన కరెంటే పోయిందని, అందుకే తిక్కతిక్కగా మాట్లాడుతున్నారని సెటైరిక్‌గా ట్వీట్ చేశారు. శనివారం వరుస ట్వీట్లతో చంద్రబాబుపై ఆయన ధ్వజమెత్తారు. 'ఐదేళ్లలో అమరావతిలో ఒక వీధి కూడా పూర్తికాలేదు. ఇంకో ఐదేళ్లు అవకాశం ఇస్తే 20 హైదరాబాద్‌లు కడతాడట. అంతా గ్రాఫిక్స్ లోనే కదా.! 200 హైదరాబాద్‌ల గ్రాఫిక్స్ తయారు చేయించండి. సిగ్గు లేకుండా అబద్ధాల మీద అబద్ధాలు చెబుతున్నాడు. చేసిన మాయలు చాలు తప్పుకోండని ప్రజలు ఛీకొడుతున్నారు.

**ఫిర్యాదు చేశాం.. పట్టించుకోలేదు..**

నారాయణ, భాష్యం, కెఎల్, గీతమ్ యూనివర్సిటీలు, టీడీపీ అనుకూల సంస్థల సిబ్బంది అంతా డబ్బుపంపిణీలో బిజీగా ఉన్నారు. నెల్లూరులో నారాయణ ఉద్యోగులు రూ.38 లక్షలతో పట్టుబడ్డారు. పోలీసులే డబ్బు తరలిస్తున్నారని ఎలక్షన్ కమిషన్‌కు ఇంతకు ముందే ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోలేదు. మీ బంధువు, ఇంటెలిజెన్స్ చీఫ్ వెంకటేశ్వర్రావును ఎలక్షన్ కమిషన్ విధులను నుంచి తప్పిస్తే గుండెలు బాదుకుని కోర్టు కెళ్లావు. హైకోర్టు కర్రు కాల్చి వాత పెట్టింది. ఇప్పుడు తల ఎక్కడ పెట్టుకుంటావు చంద్రబాబూ. ఈసీకి వ్యతిరేకంగా పిటిషన్ వేసిన జీఏడీ ముఖ్య కార్యదర్శిపై కూడా చర్య తీసుకోవాలి. తెలుగుదేశం ఎన్నికల ప్రచారానికి హాజరైన వారికి పోలీసు కానిస్టేబుళ్లు, ఇంటెలిజెన్స్ సిబ్బంది డబ్బులు పంచుతున్న వీడియో వైరల్ గా మారింది. కార్యకర్తల టీ షర్టులను బట్టి పలాసలో జరిగినట్టు తెలుస్తోంది. రాజకీయాలను అధ:పాతాళానికి నెట్టేసిన నికృష్టుడిగా చరిత్రలో మిగిలి పోతావు చంద్రబాబూ..

**జనసునామీని చూడు చంద్రబాబూ..**

వినుకొండ, పాయకరావుపేట, పార్వతీపురం, మండపేట, ముమ్మిడివరం ఇలా ఎక్కడికెళ్లినా జగన్ గారి సభలకు పోటెత్తుతున్న జనసునామీని చూడు చంద్రబాబూ. అనుకుల మీడియా చూపించకున్నా సోషల్ మీడియా హోరెత్తి పోతోంది. చలవ పందిళ్లలో కుర్చీలు వేసినా వందల మంది కూడా కనిపించట్లేదు నీ సోది వినడానికి.' అని విజయసాయిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## మా కుటుంబంపై అక్రమ కేసులు: కాపు



**రాజధాని వార్తలు, అనంతపురం:** టీడీపీ నాయకులు పోలీసులను అడ్డం పెట్టుకుని మా కుటుంబంపై అక్రమ కేసులు బనాయి స్తున్నారని రాయదుర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాపు రామచంద్రారెడ్డి ఆరోపించారు. శనివా రం కాపురామ చంద్రారెడ్డి రాయదుర్గంలో విలేకరులతో మాట్లాడుతూ..టీడీపీ నాయకుల వ్యవహారంపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదన్నారు.అందుకే హైకోర్టును ఆశ్రయించనున్నామని తెలిపారు. ప్రచారానికి రాకుండా ప్రజలను కార్యకర్తలను పోలీసులు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని చెప్పారు. ప్రజల సొమ్ముతో పోలీసులకు జీతాలు ఇవ్వడం జరుగుతుందే కానీ టీడీపీ నాయకులు ఇచ్చే జీతాలతో కాదని వ్యాఖ్యానించారు.

## తెదేపాను వీడి మళ్లీ వైకాపాలోకి ఎమ్మెల్యే!



**రాజధాని వార్తలు, ఎమ్మిగనూరు :** రాష్ట్రంలో ఎన్నికల పోరు తారస్థాయికి చేరిన వేళ కర్నూలు జిల్లాలో తెదేపాను పలువురు నేతలు వీడుతున్నారు. ఇటీవల కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వీడగా.. తాజాగా కోడుమూరు ఎమ్మెల్యే మణిగాంధీ అదే బాట పట్టారు. గతంలో వైకాపా నుంచి ఎమ్మెల్యేగా గెలిచి 2016లో తెదేపాలోకి వచ్చిన మణిగాంధీ మళ్లీ పాతగూటికే చేరారు. శనివారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన రహదారిలో ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచార సభలో వైకాపా అధ్యక్షుడు జగన్ సమక్షంలో మరోసారి ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు జగన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రైతులను మోసం చేశారని, వారి పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. దగా చేసిన తెదేపా ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు వైకాపా అభ్యర్థి చెన్నకేశవ రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో వేడెక్కిన ఎన్నికల ప్రచారం



రాయపూడిలో ప్రచారం చేస్తున్న డా॥ ఉండవల్లి శ్రీదేవి



ప్రచారం చేస్తున్న బొడే ప్రసాద్



ప్రచారం చేస్తున్న షబానా ఖాతూన్




ప్రచారం చేస్తున్న పివిపి




ప్రచారం చేస్తున్న గల్లా జయదేవ్




ప్రచారం చేస్తున్న షర్మిలా



కార్పెంటర్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్లమెంట్ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు



ప్రచార రథంపై నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న విడుదల రజని



రాంమాధవ్



ప్రచారం చేస్తున్న మంత్రి లోకేష్



ప్రచారం చేస్తున్న ఆర్కే






ప్రధాని మోడీ



సీఎం చంద్రబాబు



జగన్



పవన్ కళ్యాణ్

# మోడీ ..ఆమెను చూసి నేర్చుకోండి..

**ఉగ్రవాదంపై స్పందించే తీరును, బాధితులకు సాంత్వన చేకూర్చే ప్రక్రియను న్యూజిలాండ్ ప్రధాని జసిందా ఆర్డెన్‌ను చూసి అన్ని దేశాలు మరీ ముఖ్యంగా భారత ప్రధాని మోడీ నేర్చుకోవాల్సిందే. ఆదేశంలో రెండు మసీదులపై ఉగ్రదాడులు జరిగి 50 మంది మృతి చెందినప్పుడు ఆమె స్పందించిన తీరు అమోఘం. ఉగ్రవాదం, వేర్పాటు, ప్రాంతీయతా వాదాలతో మనుష్యుల్లో ద్వేషం పతాకస్థాయికి చేరిన వేళ జెసిందా శాంతి దూతగా అవతరించారనడంలో సందేహం లేదు. ఆ దేశానికి శరణార్థులుగా, లేదా వలసవాదులుగా వచ్చినా ప్రేమ, సహాయాలను అందించడంలో అత్యుత్తమంగా స్పందించిన తీరు ప్రపంచపౌరులను ఆకట్టుకుంది.**




ప్రేమదే అంతిమ విజయం అని ప్లకార్డులు చూపుతున్న విద్యార్థినులు

న్యూజిలాండ్ శాంతికాముక దేశం. అక్కడి ప్రజలు స్నేహసౌభాతృత్వాలతో ఉంటారు. స్థానికంగా ఉండే కొలనులో బాతు (లు) దొంగతనం జరిగినా అనేక రోజులపాటు ఆ విషయాన్ని గురించే స్థానికులు చర్చింకుకుంటారు. అదే దొంగతనం, దోపిడీ, లేదా హత్య (చాలా అరుదు) జరిగిందంటే నెలల తరబడి ఆ విషయం హాట్ టాపిక్‌గా ఉండిపోతుంది. అలాంటి దేశంలో ఒక ఆస్ట్రేలియా వ్యక్తి మరో ఇద్దరు మార్చి 15 శుక్రవారం రెండు మసీదుపై దాడిజరిపి 50 మందిని బలితీసుకోవడం న్యూజిలాండ్ ప్రజలను తీవ్రంగా కలచి వేసింది. దాడి జరిగిన 21 నిముషాల్లోనే నిందితుడు బ్రెంటన్ టారెంట్ (28) అదుపులోకి తీసుకున్నారు.






యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ బూర్జ్ ఖలీఫాపై న్యూజిలాండ్ ప్రధాని జెసింత, ముస్లిం మహిళను ఓదార్చుతున్న దృశ్యం



దాడి జరిగిందన్న వార్త తెలియగానే రెండు నిముషాలు మౌనం పాటించిన ఆటగాళ్లు

'మేము గాయపడిన హృదయాలతో ఉన్నమాట వాస్తవమేకాని, మేము ఒంటరిగా లేము' అని న్యూజిలాండ్ క్రైస్ట్ చర్చ్ ప్రాంతంలోని మసీదు ఇమామ్ గమాల్ ఫౌదా ప్రార్థనల్లో ప్రకటించడం ఆదేశ ప్రజలు ఆ మైనార్టీలకు అందించిన స్నేహహస్తాన్ని తెలియచేస్తోంది. విపత్కర పరిస్థితుల్లో ఆదేశ ప్రభుత్వం, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి బాధితులకు మానసిక ధైర్యాన్ని ఇచ్చారు.

భారతదేశ సమాజం హింస, ద్వేషాలతో విభజింపబడింది. మైనార్టీలపై మెజారిటీలు సాగించే దురాగతాలు నానాటికి పెరుగుతున్నాయి. బాధితులను ఆదుకోవడానికి ఎవ్వరూ ముందుకు రారు. అంతేకాదు.. ఎవరైనా ముందుకొస్తే హిందూ మతోన్మాద సంస్థలు వారిని కూడా హింసిస్తున్నాయి. ఈ ఘటనలను ఖండించిన వారిని దేశద్రోహులుగా ప్రకటించడానికి కూడా దేశనాయకులు ఏమాత్రం సంకోచించడం లేదు. అన్నింటికన్న వేదనా కరమైన అంశం ఏమంటే ప్రధాని మోడీ ఇలాంటి విషయాలపై ఎప్పుడూ పెదవి విప్పలేదు.

ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలపై దాడులు జరుగుతున్నాయని న్యూజిలాండ్‌లోని అల్ నూర్ మసీదుల దాడి దృష్యాలను వాడుకోవడాన్ని జెసిందా తీవ్రంగా ఖండించారు. అంతేకాదు దుండగుడిని పేరుతో పలకవద్దని కూడా ఆదేశించారామే. దాడిలో మృతిచెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ నిర్వహించిన అజాన్‌ను దేశం అంతటా ప్రసారమాధ్యమాలు ప్రసారం చేశాయి. ఏ మసీదుల్లో ఈ హింసాకాండ కొనసాగిందో అక్కడికి ప్రజలు హిజాబ్ ధరించిన మహిళలు టోపీలు ధరించిన పురుషులు భారీ ఎత్తున చేరుకొని వారి సంప్రదాయాలను గౌరవిస్తున్నామంటూ సంఘీభావం తెలిపడం గుర్తించదగిన అంశం. ఇందుకోసం న్యూజిలాండ్ ప్రధాని జెసిందా స్వయంగా తలపై నల్లటి దుపట్టా కప్పుకొని వెళ్లి బాధిత కుటుంబాల మహిళలను అక్కున చేర్చుకున్నారు. అంతేకాదు మహ్మద్ ప్రవక్త ప్రవచనాలైన పరస్పర ప్రేమ, జాలి, దయలు కలిగి ఉండాలని ఆమె తెలిపారు. 'దేశమంతా ఒక్క శరీరం, శరీరంలో ఏ భాగానికి బాధ కలిగినా శరీరం అంతటా ఆ బాధ ఉంటుంది' అని అన్నారు. న్యూజిలాండ్ మీకోసం పరితపిస్తోందని ఆమె బాధితులకు ఊరట నిచ్చారు. దాడి దృశ్యాలను మాధ్యమాలు ప్రసారం చేయడం, సామాజిక మాధ్యమాల్లో ప్రదర్శించడాన్ని ఆమె నిరోధించారు.





దళితులను హింసించిన ఉనా ఘటన, (ఇన్‌సెట్‌లో) మూక దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన మహ్మద్ అక్లాఖ్

మన దేశంలో అణగారిన వర్గాలు, ముస్లింమైనార్టీలపై దాడులు జరిపితే వెంటనే ఆ బీభత్స వీడియోను దేశంవ్యాప్తంగా సోషల్ మీడియాలో ఉంచుతారు. తద్వారా దేశంలోని మిగతా ప్రదేశాల్లోని ముస్లింలు, దళితులను భయాందోళనలకు గురిచేస్తారు. ఇలాంటి సందర్భాల్లో ముస్లింలను ప్రధాని మోడీ పరామర్శించిన సంఘటనలు ఏమీ లేవు.. సరికదా గుజరాత్ నరమేధంపై ప్రశ్నించిన మీడియాకు కుక్కపిల్లలు కారుకింద పడి చనిపోవడం ఎవరికైనా బాధే కదా అంటూ మరోసారి ఆయన పాషాణ హృదయాన్ని బహిరంగం చేశారు..పుల్వామా ఘటన తర్వాత దేశవ్యాప్తంగా కాశ్మీరీ విద్యార్థులపై దాడులు జరిగినా మోడీ పెదవివిప్పక పోవడం గమనార్హం. తరతరాలుగా ఈ దేశంలో పుట్టి పెరిగిన సాటి భారతీయులనే బీజేపీ అనుబంధ శాఖలైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌లు ముస్లింలను పొరుగుదేశానికి వెళ్లిపోమంటూ నిత్యం భయభ్రాంతులకు గురిచేయడం సరదాగా మారింది.. మనదేశంలో 14 శాతం ముస్లింలు ఉండగా, న్యూజిలాండ్‌లో కేవలం 1 శాతం మాత్రమే ముస్లింలు ఉన్నారు. అయినప్పటికీ అక్కడి ప్రభుత్వానికి మన ప్రభుత్వాని మధ్య ఆకాశం-పాతాళానికి మధ్య ఉన్న దూరం ఉంది.

ఆదేశం లౌకికరాజ్యానికి కట్టుబడి ఉన్నట్లు తన చేతల ద్వారా తెలియచేస్తోంది. ప్రజలకు ఆమేరకు భరోసా కల్పిస్తోంది. దుర్ఘటన జరిగిన రోజున సంతాపసూచకంగా జెండాను అవగతం చేశారు. జెసింద ప్రభుత్వం అప్పటికప్పుడు అత్యవసర నిధులను మంజూరు చేసింది. వెంటనే ఆదేశ ఇమామ్‌లందరితో ప్రధాని సమావేశం ఏర్పాటు చేసి భరోసా కల్పించారు. తుపాకుల చట్టాలను మార్చి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. పొరుగువారు శక్తిమేర వారికి సాయం చేశారు. దేశం అంతటా సంతాప దినాలు ప్రకటించారు. అన్ని మసీదులకు పోలీసు బలగాలతో రక్షణ కల్పించారు. భయపడి క్రైస్ట్ చర్చి ప్రాంతం నుంచి వెళ్లేవారికి, బాధితుల కోసం అక్కడికి వచ్చేవారికి ఉచిత రవాణా కల్పించారు. బాధుతులు కోరిక మేరకు రక్షణ కల్పించారు. మృతులకు ప్రభుత్వ ఖర్చులతో అంత్యక్రియలు జరిపారు. వలసవాదులకు, శరణార్థులకు కూడా ఆదేశంలో అత్యంత భద్రత ఉంటుందని నిరూపించారు.

భారత దేశంలో ఐదేళ్లుగా మతోన్మాదుల దాడులకు గురైన బాధిత కుటుంబాలను మానవహక్కుల సంఘం కలసినప్పుడు వారు భయం భయంగా బతుకుతున్నట్లు తెలిసింది. వారిని పట్టించుకున్న వారే లేరు. ఒంటరిగా సమాజానికి అక్కర్లేనివారిగా చాలా దీన స్థితుల్లో వారు ఉంటున్నారు. పొరుగువారు కూడా వారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం లౌకిక పార్టీలు అని చెప్పుకుంటున్న ఇతర పార్టీలు కూడా మనదేశంలో దాడులకు గురైనవారికి సాంత్వన చేకూర్చక పోవడం దారుణం.

భారత ప్రధాని మోడీ దేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా ఆప్రాంతపు సంస్కృతిని తెలిపే శిరస్త్రాణాలను ధరిస్తారు. అయితే ఎప్పుడూ ముస్లిం టోపీని మాత్రం ధరించడానికి ఏమాత్రం ఇష్టపడరు. ఆయన ఇంతవరకు ఎప్పుడూ ఇఫ్తార్ విందుల్లో కూడా పాల్గోలేదు. ఇక్కడ హంతకులు హీరోల్లా సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తారు. అంతేకాదు వారిని కేంద్ర మంత్రులు సత్కరిస్తారు. వారిపై కేసులు నమోదు అయితే అందుకు వ్యతిరేకంగా ర్యాలీలు జరుపుతారు. హంతకుడు చనిపోతే జాతీయ పతాకాన్ని కప్పుతారు. భయభ్రాంతులకు గురైన వారిపై ఇక్కడ రాజకీయనాయకులకు, మతాధికారులకు ఎటువంటి సానుభూతి ఉండదు. దాడులకు గురై బ్రతికి బయటపడిన వారిపై శ్రద్ధాశక్తులు ఉండవు. పైగా ఢిల్లీలోని గురుగావ్ మసీదులు, వాటి వద్ద ప్రార్థనా సమయాలను తగ్గించాలని రాజకీయపార్టీల అండదండలునన్న అల్లరిమూకలు ఇమాంలకు ఆదేశాలు జారీ చేశాయి. దేశంలో నాగరికత సంక్షోభంలో పడటం వల్లే, దయ, కరుణ స్థానంలో హింస, దాడులు చోటు చేసుకుంటున్నాయి.

ఆదేశంలోని మహిళా పోలీసులు, టీచర్లు, ప్రజలు, వారి తలపై దుపట్టా (హిజాబ్) కప్పుకొని బాధిత కుటుంబాల మహిళలను ఆలింగనం చేసుకొని బాధను పంచుకున్నారు. న్యూజిలాండ్ నివశిస్తున్న ఆస్ట్రేలియా వాసులు, క్రైస్తవ, యూదు, మతాధికారులు బయటికి వచ్చి ముస్లిం కుటుంబాలను ఓదార్చి వారికి సంఘీభావం తెలిపారు.

క్రైస్ట్‌చర్చ్‌లో ఉగ్రదాడి అనంతరం పరిణామాలు, ముస్లిం వర్గీయులకు ప్రధాని అండగా నిలిచిన తీరుకు యూఏఈ ఫిదా అయింది. న్యూజిలాండ్ ప్రధాని 'హిజాబ్' (తలపై స్కార్ఫ్ ధరించి ఉన్న) చిత్రాన్ని ప్రపంచంలోనే ఎత్తైన భవనం 'బూర్జ్‌ఖలీఫా'పై ప్రదర్శించారు. ఆమెకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, న్యూజిలాండ్ ప్రధాని హిజాబ్‌లో ఓ మహిళను దగ్గరకు తీసుకొని ఓదారుస్తున్న చిత్రాన్ని అరబ్ ఎమిరేట్స్ బూర్జ్‌ఖలీఫాపై ప్రదర్శించింది. 'న్యూజిలాండ్‌లో జరిగిన కాల్పులతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు భయాందోళనకు గురయ్యారు. అలాంటి సమయంలో బాధితులకు అండగా నిలవడమే కాకుండా వారికి భరోసా ఇచ్చిన మీరు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 1.5 బిలియన్ల ముస్లింల మనస్సులను గెలుచుకున్నారు. మీరు చూపిన ఆప్యాయత, సానుభూతికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాం' అని యూఏఈ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ట్వీట్‌చేశారు. ఈ ట్వీట్‌కు జసిండా బదులిస్తూ 'న్యూజిలాండ్‌లో పుట్టకపోయినా ఇక్కడకు వలస వచ్చిన వారికి రక్షణ కల్పించే బాధ్యత మాదే. తమ సంస్కృతీ, సంప్రదాయాలను స్వేచ్ఛగా పాటించే హక్కు వారికీ ఉంది. వలస వచ్చిన వారికి సైతం ఎప్పుడూ అండగా నిలుస్తాం' అని తెలిపారు. ఈనెల 15న న్యూజిలాండ్‌లోని రెండు మసీదుల్లో జరిగిన కాల్పుల్లో 50 మంది చనిపోయారు. తర్వాతి శుక్రవారం ఈ ఘటనలో మృతులకు నివాళిగా యావత్ దేశం మసీదుల వద్దకు చేరుకొని సంఘీభావం తెలిపింది. ఆదేశ పార్లమెంటులో ఖుర్‌ఆన్‌ను పఠించారు. ప్రార్థనలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. ముస్లిం సమాజాన్ని గౌరవిస్తూ, వారికి అండగా నిలిచిన న్యూజిలాండ్ ప్రజలు, వారి ప్రధాని జసిండా ప్రపంచ మన్ననలు పొందుతున్నారు.

**- బోస్**





అంత్యక్రియల్లో సహకరించిన న్యూజిలాండ్ వాసులు, (ఇన్‌సెట్‌లో) ముస్లిం సోదరులకు సంఘీభావం తెలుపుతున్న పోప్

# నేతలపై అసంతృప్తి

**తెలంగాణలో ఒక్క లోక్‌సభ స్థానానికి 480 మంది అభ్యర్థులు**

1996 ఎన్నికల్లో నల్గొండ ఓటర్లకు ఇదే పరిస్థితి ఎదురైంది. బ్యాలెట్ కేంద్రంగా జల ఉద్యమ కారులు చేపట్టిన ఓ వినూత్న నిరసనతో అక్కడి ఓటర్లు తన అభ్యర్థిని ఎన్నుకోడానికి కాస్త కష్టపడాల్సి వచ్చింది. ఈ ఘటన దేశం మొత్తాన్ని ఆకర్షించింది. ఒకే పార్లమెంట్ స్థానం నుంచి 480 మంది అభ్యర్థులు బరిలోకి దిగడానికి కారణం నీటి సమస్య. ఆ జిల్లా నుంచే జీవ నదులు ప్రవహిస్తున్నా నీటి కేటాయింపులో మాత్రం వివక్ష ఎదురవుతోందని జల ఉద్యమకారులు భావించారు. కృష్ణా నది జలాల్లో 76 శాతం వాటా తమకు రావాల్సిన ఉన్నా రాజకీయాల కారణంగా అది దక్కకుండాపోయిందని పోరాటం ప్రారంభించారు. దుశ్చర్ల సత్యనారాయణ వంటి ఉద్యమకారులు 1980 నుంచే జలసాధన సమితిని స్థాపించి నీటివాటా కోసం పోరుబాట పట్టారు. నల్గొండకు దక్కాల్సిన న్యాయమైన నీటి వాటాకు, సాగు- తాగు నీటి కోసమే ఆనాడు ఎన్నికల్లో పోటీ చేశామన్నారు. 1996లో మూకుమ్మడి



నామినేషన్లు వేసి ఓ వినూత్న ఆందోళన చేపట్టాలని నిర్ణయించుకుని దాదాపు 682 మందితో నామినేషన్ వేయించాం" అని ఆయన చెప్పారు. 'వాస్తవానికి ఈ నిర్ణయాన్ని 1994 డిసెంబర్‌లోనే



తీసుకున్నామన్నారు. 1996 ఎన్నికల్లో 537 మంది నామినేషన్లు వేశారు. ఇందులో 66 మంది మహిళలు ఉన్నారు. అయితే, 22 మంది తర్వాత తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 35 మంది



అధికారం చేపట్టాలనే కోరికతో తమ అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేయలేదని కేవలం తమ సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకొచ్చి అవగాహన కల్పించాలని మూకుమ్మడిగా పోటీకి దిగామని దుశ్చర్ల చెప్పారు.

'న్యాయమైన నీటి వాటా, ఫ్లోరైడ్ రహిత నల్గొండ కోసమే ఎన్నో ఉద్యమాలు చేశాం. లక్ష మందితో ప్రధానికి పోస్టుకార్డుల పంపిణీ, వేలాది మందితో పాదయాత్రలు చేశాం. ఫ్లోరైడ్ బాధితులతో ఢిల్లీకి వెళ్లి నాటి ప్రధాని వాజ్‌పేయిని కలిశాం. జంతర్ మంతర్‌లో ఆందోళనలు చేశాం అయినా రాజకీయ నాయకుల్లో ఎలాంటి మార్పు రాలేదు. మా కష్టాలను వారి దృష్టికి తీసుకొచ్చేందుకే ఎన్నికల్లో పోటీకి దిగాం" అని ఆయన పేర్కొన్నారు. అప్పటి ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఎక్కువగా ఉండటంతో 50 పేజీల బ్యాలెట్ పేపర్‌ను, ఐదు అడుగులకు మించిన బ్యాలెట్ బాక్సును ఎన్నికల సంఘం ప్రత్యేకంగా తయారు చేసిందని దుశ్చర్ల తెలిపారు. ఇప్పటి వరకు ఒక పార్లమెంట్ స్థానం నుంచి అత్యధిక మంది అభ్యర్థులు పోటీ చేసిన రికార్డు నల్గొండ పేరిటే ఉంది. ఆ తర్వాత స్థానం కర్నాటకలోని బెల్గాం నియోజకవర్గానిది. ఇక్కడ 1996లో 456 మంది పోటీ చేశారు. ఇదే సంవత్సరం తూర్పు ఢిల్లీ నియోజకవర్గం నుంచి 122 మంది బరిలోకి దిగారు.

నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 480 మందికి పోటీ చేసే అవకాశం కలిగింది, 480 మంది బరిలో ఉండటంతో ఎన్నికల సంఘం అక్కడ పోలింగ్‌పై పునరాలోచనలో పడింది. అంతమందితో పోలింగ్ నిర్వహించలేమని భావించి ఏప్రిల్‌లో జరగాల్సిన ఎన్నికలను ఆ ఒక్క చోట మే 27కు వాయిదా వేసింది. పోలింగ్ కోసం ప్రత్యేకంగా భారీ బ్యాలెట్ బాక్సును రూపొందించింది. 480 మందికి గుర్తులు కూడా కేటాయించింది..

ఆ ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సులో 331వ నంబర్‌లో ఉన్న సీపీఐ అభ్యర్థి ధర్మభిక్షం తన సమీప అభ్యర్థి బీజేపీకి చెందిన నల్లు ఇంద్రాసేన రెడ్డిపై 71వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

**ఎన్నికల సంస్కరణలు**

ప్రజా ప్రాతినిథ్యచట్టం 1951 లోని సెక్షన్ 34(1)(ఏ) ప్రకారం లోక్ సభకు పోటీ చేసే జనరల్ అభ్యర్థులు పూచికత్తుగా రూ. 500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే రూ. 250 ఎన్నికల సంఘానికి సమర్పించాలి. నల్లగొండ ఘటన తర్వాత ఎన్నికల సంఘం పోటీ చేసే అభ్యర్థుల విషయంలో కొత్తగా సంస్కరణలు తీసుకొచ్చింది. డిపాజిట్ రుసుంను భారీగా పెంచింది.

లోక్‌సభ, రాజ్యసభకు పోటీ చేసే జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ.25,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.10 వేలు సమర్పించేలా నిబంధనలు మార్చింది.

**కవితపై నిజామాబాద్ రైతుల తిరుగుబాటు**

తెలంగాణ ముఖ్యమంత్రి కవితపై నిజామాబాద్ జిల్లా రైతులు కూడా ఇదే తరహాలో పోరాడాలనుకుంటున్నారు. పసుపు, ఎర్రమొక్కజొన్నకు గిట్టుబాటు ధరలు కల్పించనందుకు నిరసనగా వారు పై నిర్ణయానికి వచ్చారు. నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి 185 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండడంతో అక్కడ ఎన్నికల షెడ్యూల్లోగా ఎన్నికలు నిర్వహించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని.. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) రజత్‌కుమార్ వెల్లడించారు. ఈ స్థానంలో ఎన్నికలను షెడ్యూల్ మేరకే నిర్వహించాలా? లేదా పొడిగించాలా? అన్న అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానిదే తుది నిర్ణయమన్నారు. 185మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో ఈవీఎంలకు బదులుగా పేపర్ బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ, అవసరమైన బ్యాలెట్ బాక్సుల సమీకరణపై దృష్టిసారించామన్నారు. 185మంది అభ్యర్థుల పేర్లతో ఒకే బ్యాలెట్ పత్రాన్ని ముద్రించాలా? లేక నాలుగైదు బ్యాలెట్ పత్రాల్లో 185 మంది పేర్లను ముద్రించాలా? అన్న అంశంపై




కేంద్ర ఎన్నికల సంఘం సలహాలు తీసుకుంటామన్నారు. అధిక పరిమాణంలో బ్యాలెట్ పత్రాలు ఉండనుండడంతో వాటికి తగిన పరిమాణంలో బ్యాలెట్ బాక్కులను సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. అ అంశాలపై సమీక్ష జరుపుతున్నామని, రెండ్రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. 185 మంది అభ్యర్థులకు సరిపడే సంఖ్యలో ఎన్నికల గుర్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.

**మోడీపై వారణాసిలో 111 మంది పోటీ..**

రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ గతంలో ఢిల్లీలో పెద్ద ఎత్తున, వినూత్న నిరసనలు తెలిపిన తమిళనాడు రైతులు ఈ సారి మరో కొత్త పోరాటానికి సిద్ధమయ్యారు. ఈ సారి బ్యాలెట్ పోరు చేస్తున్నారు. ప్రధాని మోడీ పోటీ చేస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ స్థానంలో భారీ ఎత్తున నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. వారణాసిలో ఆయనపై 111 మంది రైతులు పోటీచేయాలని నిర్ణయించాం' అని రైతు సంఘం నాయకుడు అయ్యకన్ను తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను బీజేపీ మేనిఫెస్టోలో పొందుపరచాలని ఆయన డిమాండు చేశారు. దక్షిణాది నదుల అనుసంధానం కోసం పోరాడుతున్న రైతు సంఘానికి ఆయన జాతీయ అధ్యక్షుడు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావాలనేది తమ ప్రధాన డిమాండు అని ఆయన చెప్పారు. ఏది ఏమైనా ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల ప్రక్రియను ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు అనుగుణంగా వినియోగించుకుంటున్నారు.

**- బోస్**

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com